క్లుప్తంగా

ఆపరేషన్ సింధూర్‌పై సంపుటి ఆవిష్కరణ



వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న ఏబీఆర్ఎస్ఎం అధ్యక్షులు వైవీ రామిరెడ్డి

తిరుపతి సిటీ: ఇటీవల భారతదేశంలో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి దేశవ్యాప్తంగా తీవ్ర ఆవేదన కలిగించింది. దాడికి భారత ప్రభుత్వం సమాధానమిస్తూ 'ఆపరేషన్ సింధూర్' అనే సైనిక చర్యను విజయవంతంగా నిర్వహించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకున్న నిర్ణయం సరైందని ఆపరేషన్ సింధూర్ విజయం చాటిచెప్పింది. దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న విద్యావేత్తలు ఈ దాడికి సంబంధించి తమ అభిప్రాయాలను విశ్లేషణాత్మక వ్యాసాల రూపంలో వ్యక్తీకరించారు. ఆ పుస్తకాన్ని ఏబీఆర్ఎస్ఎం ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం గురువారం ఆవిష్కరించారు.

విద్యార్థినికి జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డు



విద్యార్థి రెడ్డిగీతిక

తిరుపతి కల్చరల్: లిటిల్ ఏంజల్స్ స్కూల్లో చదువుతున్న విద్యార్థి ఆర్.రెడ్డి గీతకకు జాతీయ స్థాయి ఎక్స్‌లెన్స్ అవార్డు లభించిందని ఆ పాఠశాల అధినేత కె.రాజగోపాల్ తెలిపారు. టీసీఎస్ భాగస్వామ్యంతో వ్యర్థాలను ఉపయోగించి కొత్త ఉత్పత్తులను తయారు చేయడానికి అవలంభించే ఐదు పద్ధతులు అనే అంశంపై 2023లో ఆగస్టులో నిర్వహించిన వ్యాసరచన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటడమే కాక రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో విజేతగా నిలవడం గర్వకారణమని డైరెక్టర్ శ్వేతారెడ్డి తెలిపారు.

29న హథీరాం బావాజీ జయంతి



మాట్లాడుతున్న శివానాయక్

తిరుపతి కల్చరల్: తిరుమలలోని హథీరాం బావాజీ మఠంలో ఈనెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు హథీరాం బావాజీ 596వ జయంతి వేడుకలు అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నట్లు శ్రీస్వామి హథీరామ్ బావాజీ పరిరక్షణ కమిటీ, హథీరాం బావాజీ ఆలయ చైర్మన్ శివనాయక్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కార్పొరేషన్ స్థలాలను అమ్మే రైట్ మీకెక్కడిది..?



మల్లం రవిచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : ఎక్కడో చిత్తూరు నుంచి వచ్చి తిరుపతి ప్రజల అవసరాల కోసం ఉంచిన కార్పొరేషన్ స్థలాన్ని అమ్మే రైట్ మీకెక్కడుంది తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు అంటూ వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ప్రశ్నించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, అప్పటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి నూతనంగా నిర్మిస్తున్న కార్పొరేషన్‌ను 75 శాతం పూర్తి చేశారని గుర్తు చేశారు. అయితే మిగిలిన 25 శాతం భవనాన్ని పూర్తి చేసేందుకు చేతకాక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్పొరేషన్ స్థలాన్ని విక్రయించాలని చూడడం సిగ్గుచేటన్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. బుధవారం అర్ధరాత్రి వరకు 80,440 మంది స్వామి వారిని దర్శించుకోగా 33,687 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.47 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతుండగా, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఎన్ఎస్‌యూ విద్యార్థి సత్తా



రామచంద్ర శ్రీకాంత్‌ను అభినందిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: రాష్ట్రంలోని ఇబ్రహీంపట్నం వేదికగా ఈనెల 17వ తేదీ జరిగిన యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో జాతీయ సంస్కృత వర్సిటీ ఎమ్మెస్సీ యోగాథెరపీ చదువుతున్న విద్యార్థి రామచంద్ర శ్రీకాంత్ అత్యుత్తమ ప్రతిభ కబరచి రెండవ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం వర్సిటీలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి విద్యార్థినిని ఘనంగా సన్మానించి అభినందించారు. రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, యోగా విజ్ఞాన విభాగాధిపతి డాక్టర్ తపన్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

కుట్రపూరితంగానే అరెస్టు

- ఆయనకు మంచి చేయడం మాత్రమే తెలుసు
- రాజకీయ కక్షలతోనే చెవిరెడ్డిని అరెస్టు చేశారు
- చెవిరెడ్డి లక్ష్మి, మోహిత్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ శ్రేణుల మద్దతు

తిరుపతి రూరల్ : 'నిత్యం ప్రజలకు సాయం చేయాలన్న తపన.. మంచి చేయడం మాత్రమే తెలిసిన వ్యక్తి.. శత్రువుకైనా సాయం చేసే గొప్ప గుణమున్న నాయకుడు.. రాజకీయాల్లో ప్రత్యర్థిని శత్రువుగా కాకుండా..కేవలం ప్రత్యర్థిగానే చూడాలనుకునే వ్యక్తిత్వం.. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా తనను నమ్మిన ప్రజలకు అండగా నిలవాలి.. సాయం చేయాలి.. సేవ చేయాలనే తపన.. గుండెల నిండా దైవభక్తి నిండిన గొప్ప నాయకుడు.. అలాంటి వ్యక్తి తప్పు చేస్తాడా..? కూటమి ప్రభుత్వం కక్ష గట్టి చెవిరెడ్డిని అక్రమ కేసులో ఇరికించి అరెస్టు చేసింది.. చెవిరెడ్డి అరెస్టు ముమ్మాటికీ అక్రమం.. అన్యాయం.. న్యాయస్థానాల్లో తప్పుడు కేసులను ఎదుర్కొందాం.. పోరాటాలతో ముందుకు పోదాం..' అంటూ చంద్రగిరి నియోజకవర్గంలోని వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు, చెవిరెడ్డి అభిమానులు స్పష్టం చేస్తున్నారు.

మద్యం కేసులో చెవిరెడ్డిని అరెస్టు చేయడంతో అన్నివర్గాల ప్రజలు, పార్టీ నేతలు తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసానికి క్యూ కడుతున్నారు. మానసిక వేదన అనుభవిస్తున్న చెవిరెడ్డి సతీమణి లక్ష్మిని, చెవిరెడ్డి తల్లి మునిరత్నమ్మతో పాటు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి ధైర్యం చెబుతూ ఓదార్చుతున్నారు.



ఎర్రావారిపాలెం మండలం పార్టీ నేతలు, కార్యకర్తలతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

కక్షతోనే అరెస్టు చేశారు



చెవిరెడ్డి అనే వ్యక్తి చంద్రగిరి నియోజకవర్గానికి ఒక బ్రాండ్ అంబాసిడర్. రాజకీయంగా ఆయనను ఎదుర్కోలేక కక్షతోనే అరెస్టు చేశారు. చెవిరెడ్డి అరెస్టు అంటే ఏ ఒక్కరూ నమ్మలేని పరిస్థితి. కానీ కూటమి ప్రభుత్వం చెవిరెడ్డిపై అక్కసుతో అరెస్టు చేయించి పైశాచిక ఆనందం పొందింది.

- మునిలిపేటి హరికృష్ణారెడ్డి, ఎంపీటీసీ, అవిలాల

చెవిరెడ్డితోనే మైనారిటీల ఎదుగుదల



రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మైనారిటీల ఎదుగుదలకు చెవిరెడ్డి చేసిన సాయం మరువలేనిది. చంద్రగిరి నియోజకవర్గంలో ఏ ఒక్క మైనారిటీ కుటుంబం చెవిరెడ్డిని వ్యతిరేకించే పరిస్థితి లేదు. ఆయనపై ప్రభుత్వం చేసిన కుట్ర వారికే మంచిది కాదు.

- కరమల వలీ, వైఎస్సార్‌సీపీ మైనారిటీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గం

పిలిస్తే పలికే నాయకుడు చెవిరెడ్డి



ఆపద అని పిలిచిన వెంటనే పరుగెత్తుకుని వచ్చే నాయకుడు చెవిరెడ్డి. కరోనాలో ఆయన చేసిన సాయం చంద్రగిరి ప్రజలందరికీ తెలుసు. అలాంటిది చెవిరెడ్డి అక్రమాలకు పాల్పడ్డారంటే నమ్మే పరిస్థితి లేదు. ఆయన కోసం ఎంతవరకైనా పోరాడుతాం.

- దొరస్వామి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు, చెర్లోపల్లి

ప్రాణం పోసింది చెవిరెడ్డి..



కరోనా సమయాల్లో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలతో పాటు టీడీపీకి చెందిన చాలా మందికి ప్రాణదానం చేసిన గొప్ప వ్యక్తి చెవిరెడ్డి. ఆ విషయం ఆ పార్టీలో వారికి కూడా తెలుసు. ఇంతమంచి చేసినందుకే అరెస్టు చేశారేమో?

- బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, ఎంపీటీసీ, చంద్రగిరి

హిట్లర్‌ను తలపిస్తున్న చంద్రబాబు పాలన

- కూటమి అక్రమ కేసులు, అరెస్ట్‌లకు భయపడే ప్రసక్తే లేదు
- భూమన కరుణాకరరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష ధోరణితో పాలన సాగిస్తోందని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్ అని తప్పుడు ఆరోపణలతో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌పై ఆయన మండిపడ్డారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బలహీన పరచాలన్న దురుద్దేశంతో చంద్రబాబు, పవన్‌కల్యాన్, లోకేష్ తప్పుడు ఆరోపణలతో తప్పుడు కేసులు, అక్రమ అరెస్ట్‌లు చేయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు తమ పార్టీ రాష్ట్ర నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. జర్మనీలో హిట్లర్ ప్రభుత్వం ఎలా వ్యహరించిందో అలాగే కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ కూడా కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ అరెస్ట్‌లు చేసినా, ఎంతమందిని జైళ్లకు పంపినా వారి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటామని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు.

యోగాపై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ కమిషనర్ అమరయ్య

తిరుపతి తుడా: పతాంజలి యోగసమితి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని పురవీధుల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తుడా కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని నగరపాలక డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్ బాబు పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో స్పిరిచువల్ సొసైటీ సంగీతం బాబు, పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు కై లాసింగ్ రాజ్ పురోహిత్, ఓటేరు కృష్ణ, ప్రభాకర్, తంగరాజు, హరి, కిరణ్, తుడా సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

తిరుపతి తుడా: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21వ తేదీన స్థానిక తారకరామ స్టేడియంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. గురువారం తారకరామ స్టేడియంలో జరుగుతున్న పనులను అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమానికి వచ్చే వారికి తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. రెండు రోజులు పాటు వాకర్స్‌కు అనుమతి లేదన్నారు.

అనాధీన భూమి కోసం రగడ



ప్రభుత్వ అనాధీన భూమి

తిరుపతి మంగళం : తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలో గురువారం భూ అలజడి చోటు చేసుకుంది. 3.86 ఎకరాల ప్రభుత్వ భూమి మాదంటే.. మాది అంటూ రెండు వర్గాలు పోటీ పడ్డాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారి సతీష్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారుల కథనం మేరకు.. మంగళం సర్వే నంబర్ 52/2లో 3.86 ఎకరాల భూమి ప్రభుత్వ అనాధీనంగా రెవెన్యూ రికార్డుల్లో ఉందన్నారు. అయితే రెండు రోజుల క్రితం మంగళం గ్రామానికి చెందిన బత్తిరెడ్డి కుటుంబీకులు సదరు భూమి తమదేనని, 1975లో ప్రభుత్వం రైత్వారీ పట్టా మంజూరు చేసిందని, గురువారం భూమిని శుభ్రం చేసే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న రెండో వర్గం వారు ఈ భూమి తమదని 2005లో సదరు భూమిలో 160 ప్లాట్లతో లేఅవుట్ వేసి విక్రయించడం జరిగిందని వాగ్వివాదం చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు రంగ ప్రవేశం చేసి రెండు వర్గాలను అడ్డుకున్నారు. భూమి ప్రభుత్వానికి చెందినదని, పైగా కోర్టులో వ్యాజ్యం నడుస్తున్న కారణంగా ఎవరూ భూమిలోకి ప్రవేశించరాదని ఆదేశించారు. సదరు భూమిని ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబితాలోకి చేర్చిందన్నారు. రిజిస్ట్రేషన్లు కూడా చెల్లవని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే మంగళం రైతులు తమ తాతముత్తాతల కాలం నుంచి తమ ఆధీనంలో ఉందని, న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను వేడుకున్నారు.

అత్యాధునిక వసతులతో రైల్వేస్టేషన్



తిరుపతి రైల్వే స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక నగరంగా ప్రసిద్ధి చెందిన తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలను అతిత్వరలో అందుబాటులోకి తెస్తామని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ వెల్లడించారు. గురువారం ఆయన రైల్వే అధికారులతో కలసి తుది దశలో ఉన్న రైల్వే నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.300 కోట్లతో రెండేళ్లుగా తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. 20 లిఫ్టులు, 22 ఎస్కలేటర్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. టాయిలెట్స్, వాహనాల పార్కింగ్, విశ్రాంతి గదులు తదితర అన్ని సౌకర్యాలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ సూర్యనారాయణ, గుంతకల్లు డివిజన్ డీఆర్ఎం ఎస్.గుప్తా, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్ పోలీసులు, పలువురు సూపర్‌వైజర్లు ఉన్నారు.

బహుజనులకు అధికారమే లక్ష్యం

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ జాతీయ కోర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు స్పష్టం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరినీ ఒకతాటిపైకి తీసుకొస్తామన్నారు. ఏళ్లతరబడి అత్యధిక జనాభా కలిగిన బహుజనులు రాజకీయ ఎదుగుదలకు నోచుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. ఏపీ బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ పరంజ్యోతి, నాయకులు, బీసీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు కేశవులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై ఫిర్యాదుల వెల్లువ

- కలెక్టర్‌కు సచివాలయ ఉద్యోగులు, దీఆర్వోకు వీఆర్వోల మొర



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కూటమి సర్కార్ ఇచ్చిన జీవో నంబర్ 05ను సవరించాలని సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.కోటేశ్వరరావు నేతృత్వంలో కలెక్టర్‌ను కలిశారు. గురువారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేతలు పాల్గొన్నారు.

పోస్టుల కుదింపు సరికాదు..

ప్రభుత్వం వీఆర్వోలను రేషనలైజేషన్ పేరుతో పోస్టులను కుదింపు చేయడం సరికాదని వీఆర్వోల సంఘం నేతలు తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్వో నరసింహులను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో గ్రామానికి లేదా ఒక్కో వార్డుకు ఒక్కో వీఆర్వో దశాబ్దాలుగా పని చేస్తున్నారని చెప్పారు. అయితే రేషనలైజేషన్ పేరుతో రెండు గ్రామాలు, రెండు వార్డులను ఒక వీఆర్వోకు అప్పగించడం సరికాదన్నారు. అలా చేయడం ద్వారా రాష్ట్రంలో 7,500 మంది వీఆర్వోలు మిగులు ఉందని చూపడాన్ని తప్పుపట్టారు. కార్యక్రమంలో వీఆర్వోల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనోజ్ కుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామానుజం నాగరాజు, జిల్లా కోశాధికారి భాస్కర్, తిరుపతి డివిజన్ అధ్యక్షుడు చెంగల్‌రాయలు, సూళ్లూరుపేట డివిజన్ అధ్యక్షుడు కిలివేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తి పరిరక్షణకు పోరాడతాం



మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ చిత్తూరు ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి వాసు యాదవ్

తిరుపతి కల్చరల్: ప్రజల ఆస్తులను కారు చౌకగా విక్రయించి దోచుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోమని, రాజకీయాలకు అతీతంగా వాటి పరిరక్షణకు పోరాటం చేపడతామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధులు వాసు యాదవ్, పసుపులేటి సురేష్, మైనారిటీ విభాగం నేత ఇమ్రాన్ స్పష్టం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నగర నడిబొడ్డున ఉన్న కోట్లాది రూపాయలు విలువ చేసే కార్పొరేషన్ భూమిని చౌకబేరంతో విక్రయించేందుకు ప్రయత్నిస్తే కౌన్సిల్ సమావేశంలో ఆ ప్రతిపాదన తీసుకురాగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, మేయర్‌తో పాటు కొందరు కూటమి కార్పొరేటర్లు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించడం సంతోషకరమన్నారు. ప్రజల ఆస్తులను అమ్మాలని చూస్తే వైఎస్సార్‌సీపీ ఉద్యమం చేపడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను ఉపేక్షించేది లేదు



మీడియాతో మాట్లాడుతున్న జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు

తిరుపతి తుడా: మహిళలపై జరిగే దాడులను ఉపేక్షించేది లేదని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్ స్పష్టం చేశారు. తిరుపతి పర్యటనలో భాగంగా ఆమె గురువారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, రుయా, ఎస్వీ మెడికల్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో గర్భిణులకు, చంటిబిడ్డ తల్లులకు అందుతున్న వైద్యం, ఇతర సదుపాయాలు, వారి సంరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళలపై దాడులకు పాల్పడే వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ముఖ్యంగా బాలికల రక్షణ కోసం వేగవంతమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు, రుయా, మెటర్నటి ఆస్పత్రి సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి భారీ ఆదాయం



కానుకలను లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని అమ్మవారి హుండీ ఆదాయం రూ.43,86,409 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ ఏ.జయకుమార్ తెలిపారు. గురువారం గంగమ్మ ఆలయ ఆవరణలో అమ్మవారి హుండీ లెక్కింపు చేపట్టారు. హుండీ కానుకల లెక్కింపు ద్వారా నగదుతో పాటు 200 గ్రాముల, 100 మిల్లీగ్రాముల బంగారం, 328 గ్రాముల వెండి లభించింది. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణిరాజు, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది శ్రీదేవి, హెడ్ క్యాషియర్ బిందు, ఆఫీస్ అసిస్టెంట్ శర్వాణి, ఈస్ట్ పోలీసులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

తిరుపతి తుడా: ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను కమిషనర్ గురువారం కొర్లగుంట, సాయివిష్ణు లేఅవుట్, ఈఎస్ఐ హాస్పిటల్, తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రాంతాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాయివిష్ణు లేఅవుట్‌లో నిర్మించిన కొత్త అపార్ట్‌మెంట్‌లో నిబంధనల మేరకు అన్నీ ఉన్నాయా ? అని, మరో మారు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

అంధుల శరణాలయానికి చేయూత

తిరుపతి కల్చరల్: శివజ్యోతినగర్‌లోని అంధుల శరణాలయంలో చెక్క తలుపులు శిథిలం కావడంతో శ్రీజగత్ గురు సేవాసమితి , అంధుల అభ్యర్థన మేరకు శరణాలయానికి చేయూత అందించారు. ఈమేరకు గురువారం సేవా సమితి అధ్యక్షుడు మోహన్ రామిరెడ్డి ఆధ్వర్యంలో సమితి ప్రతినిధులు అంధుల శరణాలయానికి రూ.40 వేలు వెచ్చించి అమర్చిన తలుపులను ప్రారంభించారు. అంతకుముందు లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి నివాళులు అర్పించారు.సేవాసమితి ఉపాధ్యక్షుడు గోవిందరెడ్డి, కార్యదర్శి విశ్వనాథ్, శశి, సందీప్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ఉదయం7 గంటలకువస్త్రాలంకరణ సేవ, అభిషేకం
- కూటమి ప్రభుత్వం కేబినెట్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉదయం 11 గంటలకు ఆర్డీఓ కార్యాలయం వద్ద కేంద్ర కార్మిక సంఘాల ధర్నా
- ఎన్టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో కొప్పర్ల లక్ష్మి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం
- కామ్రేడ్ తారకనాథ్ 21వ వర్ధంతి సందర్భంగా ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు రక్తదాన శిబిరం
- శ్రీవకుళామాత అమ్మవారి ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు
- స్విమ్స్ శ్రీపద్మావతి ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలకు థెరప్యూటిక్ యోగా ఫర్ నాన్ కమ్యూనికబల్ డీసీసె అనే అంశంపై సెమినార్
- టీటీడీ ఆన్‌లైన్ ద్వారా మొబైల్ ఫోన్ల ఈ వేలం
- మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ సాయంత్రం 5.30 గంటలకు చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద నిరసన ర్యాలీ
- శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారు, శ్రీపుండరీక వల్లి అమ్మవార్లు మాడవీధుల్లో విహరిస్తారు
- తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు అమ్మవారి తిరుచ్చి ఉత్సవం
- తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీనివాసం, రైల్వేస్టేషన్ వద్దనున్న విష్ణు నివాసం, అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్‌లో సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్లు పంపిణీ
- వారాహి అమ్మవారి గుడిని పునర్నిర్మించాలని కోరుతూ శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఆర్డీఓకు వినతి సమర్పణ

కార్పొరేట్ ఫీజుల దోపిడీని అరికట్టాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థల్లోని ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం తిరుపతిలోని ఓ కార్పొరేట్ విద్యాసంస్థ ఎదుట ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఉదయ్‌కుమార్, సి.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఫీజుల దోపిడీని అరికట్టాలని విజయవాడలో చేపట్టిన నిరసనను కూటమి ప్రభుత్వం అడ్డుకోవడమే కాకుండా ఏఐఎస్ఎఫ్ నాయకులపై పోలీసులతో దాడి చేయించి అక్రమంగా కేసులు బనాయించారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని, ట్యూషన్ ఫీజు పేరుతో లక్షలాది రూపాయలను దండుకుంటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మూలకోనలో వ్యక్తి మృతి



ధర్మ మృతదేహం

పుత్తూరు: మండలంలోని మూలకోనలో తిరుపతికి చెందిన ధర్మ (38) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. బుధవారం తిరుపతికి చెందిన ఆరుగురు బైకుల్లో పుత్తూరు మండలంలోని మూలకోనలో సరదాగా గడిపేందుకు వచ్చారు. వారిలో తిరుపతి బాలాజీ నగర్‌కు చెందిన ధర్మ అతిగా మద్యం సేవించడంతో అపస్మారక స్థితికి వెళ్లి మృతిచెందాడు. సహచరుల ఫిర్యాదుతో పుత్తూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ధర్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మంజు, కుమారుడు హేమంత్ ఉన్నారు.

పోలీసుల తీరుపై ఫిర్యాదు

తిరుపతి అర్బన్: పోలీసుల తీరుపై జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్‌కు ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి నేతృత్వంలో ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో గురువారం భూమి అమ్మకం విషయంలో మధ్యవర్తిగా ఉండడంలో హేమలత అనే మహిళను తిరుచానూరు పోలీసులు చితకబాదారని ఫిర్యాదు చేశారు. అలాగే తిరుపతి రూరల్ మండలం బీటీఆర్ అంబేడ్కర్ కాలనీకి సంబంధించిన ఆటో కార్మికురాలు భాగ్యశ్రీని మధ్యస్తం పేరిట తీసుకెళ్లి ఓ వర్గం దాడి చేస్తే.. ప్రధాన నిందితులను ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు విచారణ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో బాధితురాలు హేమలతోపాటు మహిళలు భాగ్యశ్రీ, వీణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

పాకాల: అంకితభావంతో విధులు నిర్వహించినప్పుడే సమాజంలో మంచి పేరు వస్తుందని ఎంఈఓ బాబ్జి తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో విధులు నిర్వహించి ఇతర మండలాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ-2 లింగయ్య హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.